ప్రజల మాట ప్రగతి బాట

# ఖానాపూర్ నియోజకవర్గం



కన్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం


గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు

## ప్రగతి బాటన కన్నాపూర్..

- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- మారిన గ్రామం రూపురేఖలు
- పంచాయతీకి స్వచ్ఛతా హీ సేవా అవార్డు
- గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి


మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి స్వచ్ఛతా హీ సేవా అవార్డు అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి (ఫైల్)

కడెం, అక్టోబర్ 14 : కన్నాపూర్ ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రగతి పథంలో దూసుకెళ్తున్నది. చిన్న పంచాయతీల అభివృద్ధి సైతం అనేక నిధులను సర్కారు కేటాయిస్తున్నది. గ్రామంలో గడిచిన ఐదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. కన్నాపూర్ పంచాయతీ పరిధిలో కన్నాపూర్‌తో పాటు, చిన్నక్యాంపు, వకీల్‌నగర్, వెంకట్ నగర్, డ్యాంగూడ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల పరిధిలో మొత్తం ఓటర్లు 1013 మంది కాగా, జనాభా 1520 మంది ఉన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకాధికారులు ఇంటింటా తిరుగుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఐదేళ్ల కాలంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూశారు. దీంతో గ్రామం స్వచ్ఛతా హీ సేవా అవార్డుకు ఎంపికైంది.

**గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు..**

కన్నాపూర్ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. పంచాయతీకి నూతన కార్యాలయ భవనం నిర్మించారు. ట్రాక్టర్, ట్రాలీ కొనుగోలు చేశారు. ఐదుగురు మల్టీపర్పస్ వర్కర్లతో నిత్యం తడి, పొడి చెత్త తరలిస్తున్నారు. దాని ద్వారా ఎరువు తయారీ చేస్తున్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు నిత్యం నీరు అందిస్తునానరు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు 70 శాతం సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. నిత్యం డ్రైనేజీల క్లీనింగ్, అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. పంచాయతీలో రెండు పల్లె ప్రకృతి వనాలు, రెండు క్రీడా ప్రాంగణాలు, శ్మశాన వాటిక నిర్మాణం, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, మన ఊరు–మన బడి కింది అభివృద్ధి పనులు, నర్సరీ, వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్ వంటి అనేక పనులు చేపట్టారు. జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. స్వచ్ఛతా హీ సేవా అవార్డును మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి నుంచి సర్పంచ్ అందుకున్నారు.


ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన మొక్కలు

### అభివృద్ధి పనులతోనే అవార్డు వచ్చింది..



గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పంచాయతీ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. గ్రామంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశాం. నిత్యం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. దీంతో అభివృద్ధిని గుర్తించి జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేయడం ఆనందాన్నిచ్చింది. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది.

**- ఐదు భూమేశ్, కార్యదర్శి(కన్నాపూర్)**

### అందరి సహకారంతోనే ముందుకెళ్తున్నాం



ప్రజలు, అధికారుల సహకారంతోనే గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. దీంతో మా గ్రామానికి అవార్డు వచ్చింది. ఆనందంగా ఉంది. మరింత బాధ్యతతో ముందుకెళ్తాం. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం.

**- లోక నరేందర్‌రెడ్డి, సర్పంచ్, కన్నాపూర్**

## నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు షురూ


ఖానాపూర్ : ట్రాక్టర్‌లో దుర్గాదేవీ ప్రతిమను తీసుకొస్తున్న భక్తులు

ఖానాపూర్, అక్టోబర్ 14 : ఖానాపూర్‌లోని దేవీ శరన్నవరాత్రోత్సవాలు స్థానిక లక్ష్మీవేంకటేశ్వర ఆలయంతోపాటుగా పలు మండపాల్లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు విజయ దశమి వరకు కొనసాగుతాయి. ఖానాపూర్‌లోని మండపాలకు దుర్గాదేవి విగ్రహాలను నిర్వాహకులు తీసుకొచ్చారు. యువకులు 9 రోజుల పాటుగా అమ్మ వారి దీక్షలు స్వీకరించనున్నారు. లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచుతారు.

**ముత్నూర్‌లో..**

ఇంద్రవెల్లి, అక్టోబర్ 14 : నవరాత్రోత్సవాల వేడుకలు ప్రారంభం కానున్న సందర్భంగా ముత్నూర్‌లోని దుర్గాదేవి ఆలయం ముస్తాబైంది. శనివారం ఆలయాన్ని ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అలకరించారు. దుర్గాదేవి ఆలయంలో ఆదివారం ఘటస్థాపన చేసి ఈ నెల 24వ తేదీ వరకు నవరాత్రోత్సవాలు నిర్వహించన్నట్లు ఆలయ కమిటీ, గ్రామస్తులు తెలిపారు.


ఇంద్రవెల్లి : నవరాత్రోత్సవాలకు ముస్తాబైన ఆలయం

## సంప్రదాయాలు భావితరాలకు అందించాలి


హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న ప్రజలు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 14 : సంస్కృతీ సంప్రదాయాలు భావితరాలకు అందించాలని అవినాశ్ మహారాజ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్మాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత అభిస్తుందన్నారు. చింతవార్ ప్రకాశ్, ఫడ్ విశ్వనాథ్, బాబుముండే, గౌలి దేవిదాస్, ప్రకాశ్, లహనే గిరిధర్, గైను, తదితరులు పాల్గొన్నారు.

## దొరికిన ఫోన్ అప్పగింత

దస్తురాబాద్,అక్టోబర్ 14 : మండలంలోని రేవోజిపేట గ్రామానికి చెందిన ముప్పడి రాజు జగిత్యాల జిల్లాలోని బోర్నపెల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా దేవునిగూడెం గ్రామ వద్ద తన మొబైల్ పడిపోయింది. కాగా రాజేశ్ పంతులు అంబారిపేట గ్రామం నుంచి ఇంటికి వెళ్తుండగా మొబైల్ దొరికింది. కాగా ఆ మొబైల్ దెబ్బతిన్నది. ఆ ఫోన్‌లోని సిమ్ కార్డును తన ఫోన్ వేశాడు. ఫోన్ కాల్ రావడంతో వివరాలు అందించాడు. మొబైల్‌ని ముప్పడి రాజుకు అందించాడు. రాజేశ్ పంతులును పలువురు అభినందించారు.

## వృత్తి విద్యా కోర్సులపై శిక్షణ

ఉట్నూర్, అక్టోబర్ 14 : తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో వృత్తివిద్య కోర్సుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది విద్యార్థులకు మీసేవ విధులు, ప్రింటింగ్ ప్రెస్ కార్యకలాపాలు, సర్వీస్ పాయింట్, ఫ్లెక్సీ ప్రింటింగ్, ఫొటో స్టూడియో పనులను విద్యార్థులకు అర్థమయ్యేలా చూపించారు. అనంతరం సిబ్బంది చందు మాట్లాడుతూ విద్యార్థులకు ఒకేషనల్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌లో భాగంగా 20 మంది విద్యార్థులను సెలెక్ట్ చేసి కోర్సులో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది చందులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల సిబ్బంది

## 17న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 14 : ఖానాపూర్ మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 17 తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మోహిద్, ఎంపీడీవో బాలె మల్లేశ్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీ టీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరుకావలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామాలకు సం బంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమ స్యలపై చర్చిస్తామని తెలిపారు.